
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ తెలుగు మాసపత్రిక

FEBRUARY - 2003

# సంక్షిప్తవార్తలు

2003 జనవరి మొదటి తేదీన నిజమాబాద్ జిల్లా కులాస్‌పూర్‌లో జరిగిన కృతజ్ఞత కూటమునకు హాజరైన వారిలో పదిమంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కులాస్‌పూర్‌లో సోదరులు పి.డేనియల్ గారు సువార్త చాటుచున్నారు.

2003 జనవరి 4వ తేది నుండి సత్యవాణి టి.వి. కార్యక్రమాలు తేజ ఛానల్‌లో ప్రసారము చేయబడుట కారంభించెను. ప్రతిశనివారం ఉదయం 6:30 నుండి 7 గం॥ల వరకు సత్యవాణి టి.వి. కార్యక్రమాలు ప్రసారము చేయబడుచున్నవి. రేడియో, టి.వీ.ల ద్వారా సత్యసువార్తను విని ఆంధ్రప్రదేశ్‌లో నున్న అన్ని జిల్లాల నుండి ప్రజలు తమ హర్షాన్ని వెలిబుచ్చుచు ఉత్తరాలు వ్రాయుచున్నారు. ఈ కార్యక్రమాలు క్రీస్తు సంఘములకు ఎంతో ప్రోత్సాహకరముగా యున్న వనుటలో సందేహము లేదు.

జనవరి 10,11వ తేదిలలో తూర్పుగోదావరి జిల్లా పలివెలలో యున్న క్రీస్తు సంఘము సువార్త కూటములు నిర్వహించిరి. ఆ కూటములలో సోదరులు పి. జయపాల్ (రాజమండ్రి), మరియు డి.ఇశ్రాయేలు రాజు గార్లు వాక్యపరిచర్య చేసిరి. ఈ కూటముల వలన స్థానిక సంఘము బలపడెను. సత్యవాక్యము అనేకులకు వినిపించ బడెను. పలివెలలో సోదరులు పి.జె. కృపాలిని గారు సువార్త సేవ చేయు చున్నారు.

2003 జనవరి 15వ తేదీ బుధవారము ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలము, శివరామపురం క్రీస్తు సంఘ అవరణలో సహోదరులు వై.యేసుదాసు, వై. మరియదాసు గార్ల ఆధ్వర్యమున సువార్తికుల సదస్సు జరిగినది. ఈ సదస్సునకు 22 మంది సువార్తికులు హాజరైరి. "ప్రవచింప బడిన సంఘము" అను అంశము చర్చింబడెను.

సోదరులు వై.మరియదాసు (ఒంగోలు, ఈష్టు క్రిష్టియన్‌పాలెం) సువార్తికులు, అధ్యక్షతవహించగా, బ్రదర్ వై.పి. దేవదాసుగార్లు (పల్లామల్లి), టి. సుబ్బారావు గారు (కరవాది) ప్రార్ధనలలో నడిపించిరి. స్థానిక యువ్వనులు వై.సి.హెచ్.దేవదాసు, వై.జోష్ సామ్యూల్ పాటలుపాడిరి. సోదరులు ఎ. అహారోను (గొర్లపాడు) బైబిలు వాక్య పఠనముగావించిరి. పై అంశమును గూర్చి ఎమ్.పౌలు (కొలచనకోట), కె.యల్లమందయ్య(పెద్దగంజాం) వాక్య పరిచర్యచేసిరి, సోదరులు వై. మరియదాసు గారు సమయోచితమైన క్లుప్త సందేశములనిస్తు, సదస్సును, ఘనముగాను మర్యాద కరముగాను నడిపించిరి. స్థానిక సంఘసువార్తికులు వై. యేసుదాసుగారి వందన

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 ఫిబ్రవరి 2003 సంచిక 7

## దైవారాధన

(Worship of God)

ఆదినుండియు మానవులు దేవుని నారాధించు స్వభావము కలవారని మనం ఇదివరకే తెలిసికొని యున్నాము. మనము దేవుని నెరిగి, ఆయనను మహిమపరచవలెనని ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెనని దేవుడు కోరుచున్నాడు. దేవునియెడల మనకున్న భక్తి విశ్వాసము లన్నియును మనము ఆయనకు చేయు ఆరాధనలో తేటతెల్లమగును. దేవుని మనం ఆరాధించునపుడు నిష్కపటముగను, యధార్థముగను ఆరాధించవలెను.

యేసుప్రభువు ఇట్లనుచున్నారు: "అయితే యదార్థముగా ఆరాధించువారు, ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు; దేవుడు

ఆత్మ, గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:24).

మానవులు దేవుని వెదకుటయేగాక, ఆయనకు ఇష్టులై యుండుటకు ఆయనను వెదుకవలయును. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చు వాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). "అడుగుడి మీ కియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడును" అని యేసుక్రీస్తు చెప్పెను (మత్తయి 7:7-8).

దేవుని వెదకువారు దేవుని చిత్తము చొప్పుననే వెదకవలెను గదా? అట్లే మనముచేయు ఆరాధన దేవునికి ఇష్టపూర్వకముగా యుండవలెననిన, దేవుడు చెప్పినట్లే దానిని మనము చేయవలెను. లేనియెడల మన స్వంత అభిలాషల చొప్పున దేవుని సేవించి, ఆరాధించ ప్రయత్నించిన యెడల అట్టివి వ్యర్థమగును. భక్తుడైన యాకోబు ఇట్లు చెప్పుచున్నాడు. "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తి గలవాడని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే" (యాకోబు 1:26). మరల యేసు ప్రభువు ఇట్లనుచున్నారు, "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరుచుదురు గాని, వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు, వారు నన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు" (మత్తయి 15:7-9). మనము చూచిన ఈ రెండువచనములను బట్టి వ్యర్థమైన భక్తి, వ్యర్థమైన ఆరాధన చేయుట సాధ్యమే యని దేవుడు మనకు విశదీకరించు చున్నాడు. వ్యర్థము అనగా ప్రయోజనము లేనిది, పనికిరానిది అని అర్థము గనుక దేవునికి మనము చేయు సేవప్రయోజనకరముగా నుండునట్లు మనము జాగ్రత్తపడవలయును. ఆయనకు ప్రీతికరమైన సేవను చేయు నిమిత్తము మనము దేవుని వాక్యమును చదివి తద్వారా

దేవుని సేవింపవలయును, "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువాని గాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము" అని పరిశుద్ధాత్ముడు పౌలుద్వారా ఈనాడు మనలను హెచ్చరించుచున్నాడు (2 తిమోతి 2 : 15).

దేవుని ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను అని యేసుప్రభువు చెప్పెను. గనుక ఆయనను ఆరాధింపవలెననిన సత్యమును ముందు మనం తెలిసికొనవలెను. "సత్యమందు వారిని ప్రతిష్ఠచేయుము; నీవాక్యమే సత్యము" అని యేసుప్రభువు దేవుని వాక్యమును గూర్చి పలికెను. మరల ఆయన, "నేనే మార్గమును; సత్యమును, జీవమునై యున్నాను" అని చెప్పుచున్నారు. గనుక మనము దేవుని ఆరాధించునపుడు దేవుని యొక్కయు, దేవుని కుమారుడైన క్రీస్తుయొక్కయు వాక్యము ననుసరించి ఆరాధింపవలెను.

సత్యము ఎల్లప్పుడు పరిపూర్ణమైనది. పరిపూర్ణ సత్యము దోషము లేనిది అందువలన అది ఎల్లప్పుడు ఏకీభావమునే వ్యక్త పరచునుగాని, స్వయం విరుద్ధ సంగతుల నది బోధింపదు. సత్యవాక్య మయిన బైబిలును మనము చదువునప్పుడు అందులో మనకు కన్పడు ఆరాధనక్రమము, ఆరాధన యంతయు ఏకభావమును వ్యక్తపరచునుగాని, వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు సంగతులనది బోధించదు. దేవుని వాక్యప్రకారము లేనిదల్లా అసత్యము అని మనము గ్రహించవలయును. మనము అసత్యమును ద్వేషించి, సత్యమును ప్రేమింపవలెను. అపొస్తలుడైన పౌలు ఇట్లు వ్రాయుచున్నాడు: "దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనబరచు బలమును అనుసరించి యుండును, ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాష కలవారు అందరున్ను శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్టు మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు " (2 థెస్స 2:10-12).దుర్నీతినుండియు,

పాపమునుండియు మనము విడుదల పొందవలెనినిన మనము సత్యమును తెలిసికొని, దానిని పాటించవలయును. యేసు ఇట్లు చెప్పుచున్నారు: "మీరు నావాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31-32). మనము దేవునికి చేయు సేవ లేదా ఆరాధన సత్యవాక్యము ననుసరించి యుండవలెను. నిష్కపట హృదయము మనకు ఉన్నంత మాత్రమున అది సరిపోదు. మనకు తోచిందల్లా దైవారాధనలోనికి మనము తీసికొనిరాకూడదు.

మనము చేయు సత్యారాధన యెట్లుండవలెను అని మనం అడగవచ్చును.

మొదటిగా మన ఆరాధనమూర్తి నిజదేవుడై యుండవలెను. మానవులనుగాని, మానవకల్పిత విగ్రహములనుగాని మనం ఆరాధించకూడదు. "లోకమందు విగ్రహము వట్టిదనియు, ఒక్కడే దేవుడు తప్ప మరొక దేవుడు లేడనియు ఎరుగుదుము. దేవతలనబడినవారును, ప్రభువు లనబడినవారును అనేకులున్నారు. ఆకాశమందైనను, భూమిమీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి; ఆయననుండి సమస్తమును కలిగెను; ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే: ఆయన యేసుక్రీస్తు; ఆయనద్వారా సమస్తమును కలిగెను; మనము ఆయనద్వారా కలిగినవారము" (1 కొరింథి 8:4-6). దేవుడు ఆత్మయై యున్నాడు, ఆయన నిర్జీవమైన ఒక విగ్రహముకాదు. అందువలన ఆత్మయైన దేవుని మనం మన ఆత్మద్వారా ఆయన వాక్యజ్ఞానము కలిగి ఆరాధింపవలెను.

మనం ఆరాధించునపుడు మనకును దేవునికిని సరియైన మధ్యవర్తి యుండవలెను. ఈ మధ్యవర్తి భూసంబంధ యాజకుడు కాదు, గాని ఆయన మన ప్రధాన యాజకుడగు యేసుక్రీస్తే. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తి ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు" అని బైబిలు బోధించుచున్నది (1 తిమోతి 2:5).

"ఆకాశమండలము గుండా వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు. గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్తవిషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను గనుక మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16).

మన ఆరాధన యథార్థముగ నుండుటకు దేవునితో మనము సరియైన సంబంధమును కలిగి యుండవలెను. ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవిగాని, ప్రభువు ముఖము కీడుచేయువారికి విరోధముగా ఉన్నది (1 పేతురు 3:12). "మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మన మేమి అడిగినను అది ఆయనవలన మనకు దొరుకును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (1 యోహాను 3:22).

ఆరాధన చేయునప్పుడు మనము సరియైన మనస్తత్వము కలిగి ఆరాధించవలెను. అందువలన పౌలు ఇట్లనుచున్నాడు : "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును; ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును" (1 కొరింథి 14 : 15). "మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీ రేమిచేసినను, ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17).

ఆరాధన చేయునప్పుడు, అందలి క్రియలు సరియైనవి, అనగా దేవుడు కోరునట్టివి అయి యుండవలెను. ఆరాధనలో దేవుని మనము కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను స్తుతించవలెనని కోరుచున్నాడు. ఆయన కోరిన స్వరగానమునే మనము అర్పించవలెను గాని యాంత్రిక వాద్యములను కాదు (కొలస్స 3:16). ప్రార్థన చేయుమని

ఆయన కోరుచున్నాడు, వాక్యమును బోధించుట, ప్రభు రాత్రిభోజనమును ప్రతి ఆదివారము జరిగించుట, కానుకల నిచ్చుట గూడ ప్రతి ఆదివారమున జరుగవలెనని ఆయన గ్రంథముద్వారా మనలను హెచ్చరించుచున్నాడు. ఇట్టి క్రియలను సత్యముతోను, ఆత్మతోను చేసిన యెడల మనము దేవుని కర్పించు ఆరాధన యధార్థమైనదై ఆయనకు ప్రీతికరముగానుండును (అపొ.కా. 2:42; 1 కొరింథి 16:1- 2).

మనము చేయు ఆరాధన అంతయును ఆయన సంఘము ద్వారా చేయవలెను : "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక" (ఎఫెసీ 3:21). నీవు ఆయనకు ప్రీతికరముగా ఆరాధించవలెనినిన రక్షణపొందుట అత్యవసరము. రక్షింపబడినవారి నందరినీ ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. గనుక నీవు యేసు నందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మార్పునొంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు తడవుచేయవద్దు. (అపొ.కా. 2:47; మార్కు 16:16; అపొ.కా. 22:16).

❀ ❀ ❀ ❀


తేజ ఛానల్‌లో సత్యవాణి

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" కార్యక్రమమును తేజ ఛానల్‌లో ప్రతి శనివారం ఉ॥ 6:30 నుండి 7-00 వరకు చూడండి.

# క్రొత్త నిబంధన ఆరాధన

## (New Testament Worship)

క్రొత్త నిబంధన 3రకములైన ఆరాధనను గూర్చి చెప్పుచున్నది. మొదటిది-తెలియని ఆరాధన. ఏథెన్సు ప్రజలు విగ్రహములను పూజించుట వలన తెలియని ఆరాధనను చేయుచున్నారని పౌలు చెప్పెను (అపొ.కా. 17:23-31). రెండవది-వ్యర్థారాధన. ఈ ఆరాధన శూన్యమైనది, పనికిరానిది. ఏలయనగా అది మానవకల్పిత సిద్ధాంతములపై ఆధారపడియున్నది. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని క్రీస్తు పలికెను (మత్తయి 15:9). మూడవది సత్యారాధన: దేవుడు కోరునట్టి ఆరాధన ఇది. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను" అని చెప్పి క్రీస్తు దీనిని బలపరచెను. మన ఆరాధనామూర్తి దేవుడై యుండవలెనని దయచేసి గమనించుము. ఆయన నారాధించ వలెనని దేవుడు మనలను బలవంతము చేయడుగాని, అట్లు చేయుటకు మనము నిశ్చయించుకొనిన యెడల మన ఆరాధన ఆత్మతోను, సత్యముతోను ఉండవలెను. ఆత్మతో ఆరాధించుట అనగా నిష్కపటముగ, భక్తిభావముతో ఆరాధించుట; సత్యముతో ఆరాధించుట యనినపుడు సత్యవాక్య మయిన క్రొత్త నిబంధన ననుసరించి ఆరాధించుట. ఈ విధముగ మాత్రమే మన ఆరాధన సత్యమైనదై అంగీకారయోగ్యముగ నుండును.

### సత్యారాధన

మనము దేవుని సత్యముతో ఆరాధించవలెను. గనుక, ఆ సత్యము ఏమిటో, మనము చేయవలసినదేమిటో కనుగొనవలెను. దీనిని కనుగొనుటకు మనము క్రొత్త నిబంధన తట్టు తిరగవలెను. సత్యముతో ఆరాధించవలెనని దేవుడు మనలను కోరినప్పడు ఆయన కోరుదానిని సత్యవాక్యములో తప్పక బయలుపరచి యుండును. క్రొత్త

నిబంధనను చదువునప్పుడు ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో కనీసము అయిదు సంగతులను జరిగించినట్లు మనము కనుగొనగలము. అవి ఈ క్రింద నీయబడినవి:

1. క్రైస్తవులు దేవుని వాక్యమును ధ్యానించుటకు కూడుకొనిరి. అపొ.కా. 20:7లో పౌలు ఒక కూటములో ప్రసంగించుట చూడగలము. మనము లేఖనములను పరిశోధింపవలెనని క్రీస్తు బోధించెను (యోహాను 5:39). వాక్యమును పఠించవలెనని పౌలు తిమోతిని హెచ్చరించెను (2తిమో 2:15). బైబిలును చదువకుండగా ఆరాధన జరిగించుటను మనము ఊహించుకొనలేము. దేవుడు ఈ విధముగ మనతో మాటలాడును గనుక ఇది సరియైనది.

2. వారు ప్రార్థన చేయుటకు కూడుకొనిరి. ఆదిమ క్రైస్తవులు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరని" మనము అపొ.కా. 2:42లో చూడగలము. ఎడతెగక నిత్యము ప్రార్థన చేయుడి (1థెస్స 5:17) యని పౌలు చెప్పినందున ఇదికూడ తప్పక ఆరాధనయై యుండును. మనము విసుగక నిత్యము ప్రార్థన చేయవలెనని క్రీస్తుకూడ బోధించెను (లూకా 18:1). మానవుడు ఈ విధముగ దేవునితో మాట్లాడును గనుకప్రార్థనలేనిఆరాధన ఆరాధన కాదు అని మనము ఊహింపవచ్చును.

3. వారు దేవునికి స్తుతిగానములు చేయుటకు కూడుకొనిరి. మొదటిగా ఎఫెస్సీ 5:19 చూద్దాం: "ఒకని నొకడు కీర్తనలతోను సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి". మరియు కొలస్స 3:16ను కూడ గమనించుము. రెండు రకములైన సంగీతము ఉన్నదని, అది గాత్రము, జంత్రము అని గమనించుము. దేవుడు ఆరాధనలో స్వరగానము కోరినట్లు వాక్యము ప్రబోధించు చున్నది. హెబ్రీ 13:15లో ఆయన మన జిహ్వాఫలములను కోరెను గాని శీతలమై నిర్జీవమై మనస్సు లేనిదై యున్న యంత్రగానమును

ఆయన కోరలేదు. దేవుని మనము సంతోషపరచవలెనని జ్ఞాపకముంచుకొనుము.

4. మొదటి క్రైస్తవులు ప్రభురాత్రి భోజనము నందు పాలుపొందుటకు కూడుకొనిరి. మత్తయి 26:26-28లో క్రీస్తు ఈ భోజనమును స్థాపించెను. రొట్టె ఆయన శరీరముకు, ద్రాక్షరసము ఆయన రక్తమునకు గురుతుగా వాటినిచ్చెను. 1కొరింథీ 11వ అధ్యాయములో ప్రతి క్రైస్తవుడు రొట్టెను తిని ద్రాక్షరసమును త్రాగునపుడు క్రీస్తు శరీర రక్తములకు జ్ఞాపకార్థముగా చేయవలెనని పౌలు వ్రాసెను. అపొ.కా. 20:7లో మొదటి క్రైస్తవులు రొట్టె విరుచుటకు ఆదివారమున కూడుకొనినట్లు ఒక మాదిరి మనకున్నది. మనము కూడుకొనుట మానరాదని హెబ్రీ 10:25లో హెచ్చరింపబడినది.

5. వారు వర్ధిల్లిన కొలది కానుకలు ఇచ్చుటకు కూడుకొనిరి. కొరింథులోనున్న సంఘమును పౌలు ఇట్లు హెచ్చరించెను: "నేను వచ్చినపుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది ఇయ్యవలెనని" గమనించుము. ఎంతైనా కొంత ఇయ్యవలెనని లేదు. అది ఇష్టపూర్వక అర్పణ. కాని వారు వర్ధిల్లిన కొలది ఇయ్యవలెనని యున్నది గనుక ప్రతివారు ఎంత మట్టుకు వర్ధిల్లిరో నిశ్చయించుకొని యిచ్చుట మంచిది.

గనుక లేఖనములు బయలు పరచు ఆరాధన ఇది. మొదటి క్రైస్తవులు ప్రతి ఆదివారము ఈ విధముగ ఆరాధన జరిగించుటకు కూడుకొనిరి. మనము క్రైస్తవులమయితే వారికంటె తక్కువ చేయగలమా?

--- జె.సి. ఛోట

# సబ్బాతు సంగతి ఏమిటి ?

(గత సంచిక తరువాయి)

## గ్రంధము, పలకలు :

బైబిలును సన్నిహితంగా పఠించు విధ్యార్ధులందరు పదియాజ్ఞలను రాతిపలకపై దేవుడే వ్రాసి యిచ్చెనని అంగీకరించక తప్పదు. పది యాజ్ఞలు మొదటిసారి రెండవసారికూడ వ్రాయబడినప్పడు దేవుడే వ్రాసి యిచ్చెను. (నిర్గమ 24:12; 34:1).

అయితే మోషేచే వ్రాయబడిన గ్రంధము సంగతి యేమిటి ? మనము నిర్గమ 19వ అధ్యాయమును పరిశీలించినప్పడు సీవాయి కొండపై జరుగబోవు దానినిగూర్చి ప్రజలు సిద్ధపడుటను చూడగలము. సమస్తము సిద్ధపడినప్పడు దేవుడు ప్రజలతో పది ఆజ్ఞలలోని మాటలను నిర్గమ 20:1-17లో పలుకుట కారంభించెను. ఆ సమయమందు ప్రజలు ఉరుములను, మెరుపులను, కొండపై పొగను చూచిరి మరియు గొప్ప బూరధ్వనిని వినిరి. వారు మిగుల భయపడి వణికిరి. వారు చావకుండునట్లు దేవుడు కాదుగాని మోషే వారితో మాట్లాడ వలెనని వారు కోరిరి. మోషే మాట్లాడుటకు దేవుడు సెలవిచ్చెను మరియు అనేక యితర శాసనములను బయలుపరచెను. అవి నిర్గమ 21 నుండి 23 వరకు గల అధ్యాయములలో లిఖించబడెను.

అప్పడు "మోషే వచ్చి యెహోవామాట లన్నిటిని, విధులన్నిటిని ప్రజలతో వివరించి చెప్పెను. ప్రజలందరు యెహోవా చెప్పిన మాట లన్నిటి ప్రకారము చేసెదమని యేకశబ్దముతో ఉత్తరమిచ్చిరి" (నిర్గమ 24:3). మోషే యెహోవా మాటలన్నిటిని వివరించి చెప్పెను. వీటిలో పది ఆజ్ఞలు మరియు ఇతర శాసనములు ఇమిడి యుండెను. యెహోవా మాటలన్నియు నిర్గమ 20 నుండి 23 వరకు గల అధ్యాయములలో వ్రాయబడెను. యెహోవా చెప్పిన మాటలన్నిటిని ప్రకారము చేసెదమని ప్రజలు అంగీకరించిరి.

"మరియు మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసెను" (నిర్గమ

24: 4). "అతడు నిబంధన గ్రంధమును తీసుకొని ప్రజలకు వినిపింపగా వారు యెహోవా చెప్పినవన్నియు చేయుచు విధేయులమై యుందు మనిరి" (నిర్గమ 24:7). అప్పుడతడు రక్తము తీసికొని గ్రంధము మీదను, ప్రజలందరి మీదను ప్రోక్షించెను (హెబ్రీ 9:20). ధర్మశాస్త్ర ప్రకారము నడుచుకొందుము అని ప్రజలు అంగీకరించిరి. అది రక్తముతో ముద్రవేయబడెను. దేవునికిని ఆయన ప్రజలకును మధ్య గల ఈ ధర్మశాస్త్రము ఇప్పుడు స్థిరపరచబడెను. మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసెను మరియు ఆ గ్రంధమును తీసుకొని ప్రజలకు వినిపింపగా దానికి లోబడుటకు వారు సమ్మతించిరి. యెహోవా మాట లన్నియు అనినప్పుడు దానిలో నిర్గమ 20-23 అధ్యాయములలో గల పది ఆజ్ఞలు, యితర శాసనములు ఇమిడి యున్నవి.

దేవుని పిలుపునకు లోబడుచు, మోషేయు, అహరోనును, నాదాబును, అబీహును, ఇశ్రాయేలీయుల పెద్దలలో డెబ్బది మందియు దేవుని నారాధించుటకు కొండ ఎక్కివెళ్ళిరి. వారు దేవుని గొప్ప మహిమను తెలిసికొన గల్గిరి. వారు ఆరాధించిన తరువాత మోషేకు దేవునినుండి ఒకపిలుపు వచ్చెను: "అప్పడు యెహోవా మోషేతో ఇట్లనెను. నీవు కొండయెక్కి నాయొద్దకు వచ్చి అచ్చట నుండుము; నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను, ధర్మశాస్త్రమును, రాతి పలకలను నీకిచ్చెదననెను" (నిర్గమ 24:12).

దేవునిచే పది ఆజ్ఞలు వ్రాయబడిన రాతి పలకలను గూర్చి ప్రప్రధమముగా ఇక్కడ చెప్పబడెను. అయితే పది ఆజ్ఞలు అంతకుమందే ఇయ్యబడెను. నిర్గమ 20వ అధ్యాయములో వాటిని దేవుడు ప్రజలకు చెప్పెను, వారు భయపడి. అవి నోటితో చెప్పబడుటయేగాక, వాటిని, మిగిలిన దేవుని ఆజ్ఞలను మోషే ఒక గ్రంధమందు వ్రాసి ప్రజలకు వినిపింపగా వాటికి బద్ధులమై యుందుమని వారంగీకరించిరి. రాతిపలకలను గూర్చి చెప్పబడక ముందే ఇదంతయు జరిగెను.

మోషే దేవుని కొండమీదికి ఎక్కి వెళ్ళి అక్కడ రేయింబవళ్లు నలువది దినము లుండెను. ప్రత్యక్ష గుడారము (మందిరము) యొక్క

నమూనాను అతడు పొందెను (నిర్గమ 25:9). "మరియు ఆయన సీనాయికొండమీద మోషేతో మాటలాడుట చాలించిన తరువాత ఆయన తన శాసనములు గల రెండు పలకలను అనగా దేవుని వ్రేలితో వ్రాయబడిన రాతిపలకలను అతని కిచ్చెను" (నిర్గమ 31:18).

మోషే కొండదిగి వచ్చినప్పుడు ప్రజలు బంగారు దూడనొక దానిని ఆరాధించుట కనుగొనెను. అతడు కోపముతో మండిపడి ఆ పలకలను పడవేసి వాటిని పగులగొట్టెను. మరియు అతడు వారు చేసిన ఆ దూడను తీసికొని అగ్నిలో కాల్చి పొడిచేసి నీళ్ల మీద చల్లి ఇశ్రాయేలీయుల చేత దానిని త్రాగించెను. ఆ పలకల కొరకు అతడు రెండవసారి కొండమీదికి వెళ్లవలసి వచ్చెను. మరల అక్కడ అతడు నలువది దినములుండెను.

తరువాత మోషే వ్రాసిన ధర్మశాస్త్ర గ్రంథమును గూర్చి మనము చదువునప్పుడు, దానిలో పది ఆజ్ఞలు, మిగతా శాసనములు ఇమడ్చబడి యున్నవని గ్రహించుకొన గలము. ద్వితీయోపదేశకాండము 31:9లో, మోషే ఈ ధర్మశాస్త్రమును వ్రాసి యాజకులకును, ఇశ్రాయేలీయుల పెద్దలకును దాని నప్పగించి "మీరు ఈ ధర్మశాస్త్ర గ్రంథమును తీసికొని మీ దేవుడైన యెహోవా నిబంధన మందసపు పక్కన ఉంచుడి. అది అక్కడ నీమీద సాక్ష్యార్థముగా ఉండును" అని చెప్పెను (ద్వితీ 31:26). ప్రజలపై ఎక్కువ ప్రభావము కలిగినవాడు రాజై యుండును గనుక, మోషే రాజులకు కొన్ని హెచ్చరికల నిచ్చెను : "మరియు అతడు రాజ్య సింహాసనమందు ఆసీనుడైన తరువాత లేవీయులైన యాజకుల స్వాధీనములోనున్న గ్రంథమును చూచి ఆధర్మశాస్త్రమునకు ఒక ప్రతిని తనకొరకు వ్రాసికొనవలెను" (ద్వితీ 17:18).

దేవుని మార్గములో రాజు తన ప్రజలను నడిపించవలెనన్న, అతడు తన యొద్దనున్న ధర్మశాస్త్ర ప్రతినుండి చదువుకొని దేవుని చిత్తమును తెలిసికొనవలెను.

యోషీయా అను ఒక మంచిరాజు ఏలుబడిలో యాజకుడైన హిల్కీయా యెహోవా ధర్మశాస్త్ర గ్రంథము యొక్క ప్రతి నొక దానిని

దేవుని మందిరములో కనుగొనెను (2 దినవృ 34:14, 15). ఇది బహుశ నిబంధన మందసపు ప్రక్కన ఉంచబడిన ధర్మశాస్త్ర గ్రంథపు ప్రతియై యుండును. ఖచ్చితముగా అది రాజునొద్దకు తేబడగా, ధర్మశాస్త్ర గ్రంథపు నడిపింపు పొందిన అతడు ప్రజల భక్తిహీనతలో మార్పును కలుగజేయుట ప్రారంభించెను. మన యొద్ద దేవుని ధర్మశాస్త్రము ఉండినట్లుగానే సత్య (భక్తి) మార్గమును ప్రసరింపజేయును. రాజైన యోషీయా విగ్రహారాధనను కూలద్రోయ గల్గెను గాని, దేవుని నియమములు లేకుండా సత్యమును ఆచరించుట యొక్క అవసరత కుండెను. దేవుని ధర్మశాస్త్ర గ్రంథము దినదిన అతనికి బయలు పరచెను. నిలయముగా ఇంతవరకు మోషే ద్వారా ఇచ్చిన యెహోవా మాటలన్నిటితో ఒక భాగము గనుక అది నిర్ణయించునట్లుగా ఆ ఆజ్ఞలను కూడా బయలు పరచెను.

యూదులు బబులోను బానిసత్వములో 70 సంవత్సరములు గడిపిరి. వారు తమ స్వదేశమునకు తిరిగి వచ్చినప్పుడు మందిరమును తిరిగి నిర్మించి పాత నిబంధన ఆరాధనను ప్రసరింపచేయుట అవసరమాయెను. దానిని వారు చేసిరి గమనించుట అవశ్యకరముగా యుండెను. "అప్పుడు జనులందరును ఏక మనస్కులై నీటి గుమ్మము ఎదుట నున్న మైదానమునకు వచ్చి, యెహోవా ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించిన మోషే ధర్మశాస్త్ర గ్రంథమును తెమ్మని ఎజ్రా అను శాస్త్రితో చెప్పిరి" (నెహెమ్యా 8:1). "ఇట్లు వారు దేవుని గ్రంథమును స్పష్టముగా చదివి వివరించి జనులు బాగుగా గ్రహించునట్లు దానికి అర్థము చెప్పిరి" (నెహెమ్యా 8:8). దేవుని ధర్మశాస్త్ర గ్రంథము ముందు పండుగ దినములను గూర్చి చదువగా దానిని తెలిసికొని ప్రకారము ఆచరించు నిమిత్తము వారు సిద్ధపాటు చేయసాగిరి.

యాజకులు ప్రజలకు బోధించుటకును, వారిని రాజు నొద్దకు నడిపించుటకును ధర్మశాస్త్ర గ్రంథము అతి ప్రాముఖ్యమైనది. రాతి పలకలు ఒక మందసపు ప్రక్కలో ఉంచబడెను. అది నిబంధన మందసములో ఉంచబడెను.

## సబ్బాతు ప్రయోజనము :

ఏడవ దిన విశ్రాంతి యొక్క ప్రయోజనమును గూర్చి మనము ఆలోచించినప్పడు, అది సబ్బాతు ఆచరణ యొక్క ఆరంభమును గూర్చి తెలియజేయును : "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పడు నీ దేవుడైన యెహోవా బాహు బలము చేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడ నుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందు చేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వితీ 5:15).

ప్రజలు బానిసత్వములో లేకముందు వారు బానిసలుగా యున్నట్లు సబ్బాతు వారికి ఎట్లు జ్ఞాపకము చేయును ? దేవుడు వారిని బానిసత్వము నుండి విడిపించుటలో చేసిన మేలును, వారి విమోచనను ప్రజలు మరచిపోదురని దేవుడెరుగును గనుక వారు ఆచరించు నిమిత్తము ఆయన వారికి సబ్బాతు చట్టము నిచ్చెను.

దేవుడు చేసిన కొన్ని ప్రాముఖ్య సంగతులున్నవి. ప్రజలు వాటిని జ్ఞాపక ముంచుకొనవలెనని ఆయన కోరుచున్నాడు. జలప్రళయము తరువాత సమస్త శరీరులు జలప్రవాహము వలన ఇకను లయపరచ బడురు అని దేవుడు నోవహుకు వాగ్దానము చేసెను. ఆ వాగ్దాన గురుతుగా మేఘములో ఆయన తన ధనస్సు నుంచెను (ఆది 9:11). ఆ ధనస్సు మేఘములో ఇప్పడుకూడ మనము చూచునప్పడు ఆ వాగ్దానము మనము జ్ఞాపక ముంచుకొందుము. మన కొరకు చనిపోవు నిమిత్తము దేవుడు తన కుమారుని పంపెను. ఈ గొప్ప శ్రమను, బలియాగమును జ్ఞాపక ముంచుకొను విధానము ఏదియు లేని యెడల మానవుడు దానిని మరచిపోవును. యేసు చనిపోక ముందు ఆయన ప్రభురాత్రి భోజనము నిచ్చెను (1 కొరింథీ 11:23-30). యేసును, ఆయన మరణమును జ్ఞాపక ముంచుకొనుట కొరకు దానిలోని రొట్టెను తిని, ద్రాక్షారసమును త్రాగవలెనని ఆయన హెచ్చరించెను. దీనిని ప్రతి ఆదివారము మనము జరిగించుచు ఈ ప్రాముఖ్య సత్యమును మన ముందు ఉంచుకొందుము. మనము మరచి

పోరాదు !

ఐగుప్తు నుండి దేవుడు వారిని ఎట్లు విమోచించెనో ఇశ్రాయేలీయులు జ్ఞాపక ముంచుకొను నిమిత్తము ఆయన సబ్బాతును ఒక జ్ఞాపకార్థముగా వారిముందు ఉంచెను. "అందుచేతను విశ్రాంతి దినము ఆచరించవలెనని నీదేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను. పది ఆజ్ఞలు ఈయబడక రెండు వారములు ముందు నిర్గమ 16లో విశ్రాంతి దినము ఆచరింపబడుట వారు ఐగుప్తు నుండి విమోచింప బడిన తరువాతనే జరిగెను.

ఐగుప్తు నుండి తాము విమోచింప బడిన వాస్తవమును జ్ఞాపక ముంచుకొనుట కొరకు యూదులకు సబ్బాతు ఈయబడెను గనుక, దానిని అన్యుడు ఎందుకు ఆచరించును ? వారు ఐగుప్తు నుండి విమోచింపబడిరా ? దానిలో వారికి ఉన్న భావమేమిటి ? నీది కాని దేశము యొక్క స్వాతంత్ర్య దినము నాచరించుటలో ఎంత భావ ముండునో దానిలో వారికి అంత భావముండును. సబ్బాతు ఆరంభము లోను, ప్రయోజనములోను యూదులది.

## ఎవరికి ఈయబడెను ?

"మోషే ఇశ్రాయేలీయులు నందరిని పిలిపించి. . .మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను" (ద్వితీ5:1,2). అట్లని చెప్పుచు అప్పడు పది యాజ్ఞలను వివరించి 12వ వచనములో సబ్బాతును గూర్చిన ఆజ్ఞను చెప్పెను. ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధనలో సబ్బాతు ఒక భాగమై యున్నట్లు ఆ వివరణ విపులముగా యున్నది. అది మానవులందరికీ ఈయబడిన నిత్య నిబంధన కాదుగాని అది ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి పొందిన విమోచనను జ్ఞాపక ముంచుకొను నిమిత్తము యూదులకే ఈయబడిన ఆజ్ఞయై యున్నది.

--- ఆర్థర్ గార్డనర్

(సశేషము)

# బైబిలు అర్ధము చేసికొనుటకు పది సూత్రములు
## (గత సంచిక తరువాయి)

అర్ధము చేసికోగలిగినదంతా ఇప్పుడు అర్థం చేసికో. మిగత సంగతులు తరువాత అర్ధమగును : బైబిలు నంతటినీ క్షుణ్ణంగా అర్ధము చేసికొనుటకు కనిపెట్టుటకంటే దానిలోని సూక్ష్మ సంగతులను ఇప్పడే మనం అర్ధము చేసికోవచ్చును. పసివారికి పాలవలె బైబిలులో సూక్ష్మమైన సంగతులున్నవి. అట్లే బలవంతులకు మాంసమువలె అందులో లోతైన మర్మము లున్నవి (హెబ్రీ 5: 12-14). మనము బైబిలు చదివేకొలది దానిలోని ప్రతి భాగము విశదమగుచుండును. అయితే దానిలోని ప్రతిసంగతీ సంపూర్ణముగా అర్ధమయ్యేవరకు కనిపెట్టుట కంటే, దేవుడు మనలను చేయుమని ఆజ్ఞాపించిన వాటిని చేయుటకు మొదలుపెట్టాలి.

మార్టిన్ లూధర్ చిన్నతనంలో ఒక ఏపిల్ చెట్టుమీద కొద్ది పాటి కాయలు మాత్రమే పండ్లవడం చూచాడు. అయితే సాధ్యమైనంత ఎక్కువ ఏపిల్‌పండ్ల కొరకు అతడు చెట్టును కుదిపేవాడు, తరువాత మిగతా కాయలు పండ్లయ్యేకొలది వాటిని అతడు సంపాదించు కొనేవాడు. యిదే సూత్రాన్ని అతడు తన బైబిలు పఠనమునకు వర్తింప జేసుకొన్నాడు. అతడు గ్రహించుకోగలిగినంత సాధ్యమైనంత త్వరలో గ్రహించుకొన్నాడు. తరువాత కఠినమైన సంగతులు అతనికి సులభమయ్యాయి.

బైబిలులో కొన్ని సంగతులు గ్రహించుటకు కష్టమైనవి కలవు (2 పేతురు 3:16). ఇక్కడ కొన్ని సంగతులే అని చెప్పబడెను గాని అన్ని సంగతులు కావు. అయితే కష్టమైన కొన్ని సంగతులను కొందరు తమ స్వకీయ నాశనము కొరకు అపార్ధము చేసికొందురు. ఈ సంగతులను అర్ధము చేసికొనలేరని అక్కడ చెప్పబడలేదు, గాని అర్ధము చేసికొనుటకు కొంచెము కష్టమైనవి.

మన దేవుని యెడలను తోటి మానవులయెడలను నిర్వర్తించ వలసిన విధులను గూర్చిన సంగతులు సులభమైనవి. వాటిని మనం

గ్రహించుకొని దేవునికి విధేయులు కావాలి. తరువాత ఎక్కువ నేర్చుకొనవచ్చును (మత్తయి 28:19-20). అనేకులు క్రీస్తును గూర్చి వినిన మొదటి దినమందే క్రైస్తవులైనట్లు అపొస్తలుల కార్యములు చెప్పచున్నది. తరువాత వారు విశ్వాసములో పెరిగారు, అభివృద్ధి జెందారు. దేవుని చిత్తాన్ని తెలిసికొని దాన్ని జరిగిస్తే శాంతి సమాధానములు కలుగుతాయి.

3. బైబిలులోని 66 పుస్తకములను మనం సరిగ విభజించుచు శ్రద్ధగా చదవాలి.

బైబిలులో 66 పుస్తకములున్నను, అవి చిన్నవే. రోజుకు 1/2 గంట చొప్పన చదివితే క్రొత్త నిబంధనను 7 వారములలోను, బైబిలు అంతటిని 7 మాసములలోను చదివేయవచ్చును. శ్రద్ధగా చదవాలంటే ఇంకా ఎక్కువ కాలము పట్టును. ప్రాథమిక సత్యములను మనం ఇట్టే గ్రహించుకోగలము అయితే మనం జీవించునంతకాలము నేర్చుకోదగిన గొప్ప వాస్తవములుదానిలో యున్నాయి. కీర్తనల గ్రంథకర్తవలె "నేను నీ ధర్మ శాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము" అని మనమును ప్రార్థించగలము (కీర్త 119:18).

2తిమోతి 215లో శ్రద్ధగ పఠించే ఆవశ్యకత చూపబడింది: "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగ ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము" అని అది చెప్పచున్నది. మనకు ఇంత తెలుసునని గొప్పచెప్పకొనుటకు గాక, దేవుని యెదుట యోగ్యునిగా కనబడుటకు వాక్యము పఠించాలి.

ఎవడైనను గ్రంథాలయమునకు వెళ్లి ఏదో ఒక పుస్తకము తీసికొని దాని మధ్యలో ఆరంభించడు. అయినను అనేకులు బైబిలును అట్లే చదువుతారు. ఒకడు చరిత్ర చదవాలనుకొన్నపుడు చరిత్ర గ్రంథాన్ని చదువుతాడు. గణితమును గూర్చి చదవాలన్నపుడు ఆ గణిత గ్రంథాన్ని చదువుతాడు. మరల లెక్కలలో కూడ కఠినమైన లెక్కలకు ముందు ప్రాథమిక లెక్కలను నేర్చుకుంటాడు. బైబిలును చదివేటప్పుడు మనము

కూడ అదేరకమైన తెలివిని ఉపయోగించాలి. బైబిలులోని పుస్తకాలలో చట్టము, చరిత్ర, పద్యకావ్యములు, ప్రవచనములు, జీవిత చరిత్రలు మొదలుగునవి యున్నవి. మనము దేనిని గూర్చి తెలిసికొన గోరుచున్నామో ఆ భాగాన్ని బైబిలులో చదవాలి.

**4. దేవుడు మూడు వివిధ కాలాల్లో వివిధ మతవిధానాల నిచ్చి** నందున, బైబిలును చదువునప్పుడు ఆ సంఘటన ఏ కాలములోనిదో గమనించుము.

బైబిలులో రికార్డు చేయబడిన మూడు వివిధ యుగము లేమనగా :

1. పితరుల యుగము : ఆదామునుండి మోషేవరకు గల ప్రథమ యుగములో దేవుడు లిఖితపూర్వక చట్టము నియ్యలేదు. అది ఇంచుమించు 2500 సంవత్సరము లుండెను. ఆయన అబ్రహాము లాంటి గోత్రకర్తకు తన చిత్తమును తెలియజేయగా అతడు దానిని తన కుటుంబానికి లేక గోత్రానికే తెలియజేసేవాడు. (ఆదికాండము 18:18-19 చదువుము). ఆదికాండము మొదటి అధ్యాయము నుండి నిర్గమ కాండము 20వ అధ్యాయము వరకు గల ప్రజలందరు పితరుల యుగములో జీవించినవారే.

2. మోషే యుగము (లేదా) యూదుల యుగము : తరువాత 1500 సంవత్సరముల మట్టుకు దేవుడు ప్రత్యేక ప్రజలకు ప్రత్యేక చట్టము (ధర్మశాస్త్రము) నిచ్చెను. వారు ఇశ్రాయేలీయులు. క్రీస్తు ఆ జనాంగమునుండి ఉద్భవించు నిమిత్తము దేవుడు వారిని తన కొరకు ప్రత్యేకముగా ఏర్పరచుకొనెను. క్రీస్తు వచ్చువరకు ఇశ్రాయేలీయులకు దేవుడు పాతనిబంధన ననుగ్రహించెను (గలతీ 3:19; యోహా 1:17). దానిని ఆయన మోషేద్వారా అనుగ్రహించెను. అందువలన ఆ కాలమును మోషే యుగమని, లేదా యూదుల యుగమని పిలువ బడుట జరిగింది. మరియు ఆ ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే తప్ప మరెవరికిని ఇయ్యబడలేదు (ద్వితీ 5:1-3; నిర్గమ 19: 6; మరియు నిర్గమ 20 అధ్యా). పాతనిబంధలోనివి యూదుల మతాచారములే గాని క్రైస్తవ్యము కాదని గుర్తించుకొనుము.

3. క్రైస్తవ యుగము : క్రీస్తు సిలువమీద చనిపోయి నప్పటినుండి క్రైస్తవ జీవనవిధానము అమలులోనికి వచ్చినది (హెబ్రీ 9:16, 17). క్రీస్తు మరల వచ్చువరకు అది కొనసాగును. నేడున్న మానవులందరికి క్రొత్త నిబంధన వర్తించును. క్రీస్తు ఈ లోకమునకు వచ్చిననాటినుండి ఏదైన ప్రత్యేక ప్రజలకు దేవుడొక ప్రత్యేక చట్టము నీయలేదు. అందరును క్రొత్త నిబంధనను బట్టియే నడుచుకోవలెను. గనుక బైబిలును చదువు నపుడు ఏ కాలములో జరిగిన సంఘటనను చదువుచున్నావో గమనించుకొనుట ముఖ్యము.

5. పాతక్రొత్త నిబంధనల వ్యత్యాసమును గమనించుము : పాత నిబంధన చట్టము మనకు వర్తించకుండుటకై క్రీస్తు దానిని ఎత్తివేసి క్రొత్త నిబంధనను గ్రహించెను. పాత నిబంధనలోని నైతిక వర్తనమును మతాచారములను గమనించి అవి క్రొత్త నిబంధనకు వేరుగా యున్నవి గనుక ప్రజలు గలిబిలియగుదురు. పాత నిబంధన ప్రజలు భిన్నమైన మతపద్ధతికి లోనైజీవించిరి. కొందరు పితరుల యుగమును నక్షత్ర కాంతికిని, యూదుల యుగమును చంద్రకాంతికిని, క్రైస్తవ యుగమును సూర్యకాంతికిని పోల్చుదురు. ఈ యుగంలో దేవుని పూర్తి బయల్పాటు యొక్క వెలుగు ప్రకాశించెను.

క్రీస్తు ఈ లోకమున కవతరిస్తాడని, దేవుడొక నూతన నిబంధనను అనుగ్రహిస్తాడని దేవుని ప్రవక్తలు ముందుగనే ప్రవచించిరి (యిర్మియా 31:31-33).

క్రీస్తు మరణము తరువాత అందరు పాతనిబంధన క్రిందగాక, క్రొత్త నిబంధన క్రిందనే యుందురని హెబ్రీ పత్రిక వక్కాణించుచున్నది.

- "దేవుడు మన పితరులతో ప్రవక్తల ద్వారా మాటలాడెను, గాని ఇప్పుడు ఆయన కుమారుని ద్వారా మనతో మాటలాడెను" (హెబ్రీ 1:1).

- "అవశ్యముగా యాజక ధర్మము మార్చబడెను" (హెబ్రీ 7:12).

- "క్రొత్త నిబంధన అని చెప్పటచేత ఆయన మొదటిది పాతదిగా చేసియున్నాడు" (హెబ్రీ 8:13).

- "ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైయున్నాడు" (హెబ్రీ

9:15-17).

- "ఆయన క్రొత్త నిబంధనను స్థిరపరచుటకు మొదటిదానిని కొట్టివేయుచున్నాడు" (హెబ్రీ 10:9-10).

పాత నిబంధన ఒక చట్టముగా నేటి ప్రజలకు వర్తించుటలేదని, దానిని, క్రీస్తు ఎత్తివేసెనని చెప్పటకు అనేక లేఖనములను మనం ఇంకా ఇయ్యవచ్చును. అది సిలువకు మేకులతో కొట్టివేయబడెను (కొలస్స 2:14). మనలను క్రీస్తు నొద్దకు నడిపించుటకు పాత నిబంధన బాలశిక్షకుడాయెను. అయితే క్రీస్తు వెల్లడి ఆయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము (గలతీ 3:23-25).

6. బైబిలును 66 పుస్తకములు గల ఒక గ్రంథాలయముగ పరిగణించుము :

విశిష్టమైన సంగతుల కొరకు సరియైన స్థానములో వెదకుము. బైబిలునందు రెండు ముఖ్యభాగములున్నవి-పాతనిబంధన, క్రొత్త నిబంధన, క్రీస్తు రాకముందు సంభవించిన సంగతులు పాత నిబంధనలో గలవు. అయితే నేడు మనకు దానిలో అనేక పాఠము లున్నాయి. (1 కొరింథీ 10:11). క్రీస్తు రాక ముందున్న ప్రజలతో దేవుడు ఆధ్యాత్మికంగా సంప్రదించిన పద్ధతియది. ఆనాటి విశ్వాస వీరులను గూర్చి నేడు మనం చదివితే ధైర్యములభిస్తుంది. దేవునికి విధేయత చూపిన వారిని గూర్చి అవిధేయత చూపినవారిని గూర్చి అనేక మాదిరులు మనం దానిలో చదివి, దేవుడు ఎల్లప్పుడు విధేయతనే కోరాడని తెలిసికోగలం. క్రీస్తు రాక కొన్ని వందల సంవత్సరముల ముందే చెప్పబడిన ప్రవచనాలను చదువుటద్వారా మన విశ్వాసం బలపడగలదు.

*(సశేషం)*

గమనిక : సత్యవాక్కు వలయు వారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

**Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.**

సమర్పణతో సదస్సు ముగిసినది. సదస్సు అనంతరం సువార్తికులకు మంచి విందు భోజనం కల్పించిరి.

2003 జనవరి 17వ తేది శుక్రవారము ప్రకాశంజిల్లా ఒంగోలు పట్టణం ఈస్ట్ క్రిష్టియన్‌పాలెం సోదరులు టి.పేరయ్య ఇంటి అవరణము నందు సోదరులు వై. మరియదాసు, వై. యేసుదాసుగార్ల ఆధ్వర్యములోన సువార్తికుల సదస్సు జరిగినది. ఈ సదస్సునకు 20 మంది సువార్తికులు హాజరైరి. "క్రీస్తు ద్వారా దేవుని విమోచన మార్గం" అను అంశమును చర్చించ బడెను.

సోదరులు వై. యేసుదాసు (శివరామపురం) సువార్తికులు అధ్యక్షత వహించగా బ్రదర్ వై. కోటయ్య, కె. జోసఫ్ (పెద్దగంజాం) ప్రార్థనలో నడిపించిరి. స్థానిక యువకులు టి.జర్మియ, టి.సాల్మాన్‌రాజు, సత్యవాణి కీర్తనలు పుస్తకము నుండి పాటలు నడిపించిరి.

పై అంశమును గూర్చి కె. యల్ల మందయ్య (పెద్దగంజాం) ఎమ్.పౌలు కొలచనకోట వాక్యపరిచర్య చేసిరి. వై. యేసుదాసుగారు సముయోచితమైన కుప్త సందేశములనిస్తూ సదస్సును ఘనముగాను మర్యాదకరముగాను అధ్యక్షులుగా నుండి నడిపించిరి. స్థానిక సంఘసువార్తికులు వై. మరియదాసు గారు వందన సమర్పణతో సదస్సు ముగిసినది. సదస్సు అనంతరం మంచి భోజన సదుపాయము కల్పించిరి.

జనవరి 19వ తేదీ ఆదివారం తెల్లవారు జామున జాషువా గూటం గారి ద్వితీయ కుమారుడు సామ్యూల్ రోనీ గారు క్రిస్మస్ సెలవుల అనంతరం అమెరికాకు తిరిగి వెళ్లిరి. ఆయన అక్కడ కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎమ్. ఎస్. చేయుచున్నారు. ఆయన 20వ తేదీ రాత్రికి అమెరికా క్షేమముగా చేరుకొనిరి.

జనవరి 19 నుండి 22 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో 19వ వార్షిక బైబిలు లెక్చర్‌షిప్ జరిగినది. ఆ లెక్చర్‌షిప్‌కు వందలాది ప్రజలు హాజరైరి. ప్రతిరోజు మూడు కూటములు జరిగెను. రోజుకు 9 ప్రసంగములు వినిపించబడెను. ఆ లెక్చర్‌షిప్‌లో సోదరులు జాన్‌ఫోర్డ్, ఫ్రాన్సిస్‌డేవిడ్, T.జ్ఞానానందం, పాల్ సుబాన్, నెహెమ్యా గూటం, జాషువా గూటం, తువాల్‌చిన్ నిషాల్(మణిపుర్) తదితర్లు ప్రసంగించిరి. ఇంచుమించు 65 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరి నేన్సీ ఫోర్డ్‌గారు స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించిరి.

జనవరి 23వ తేదీన కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ గ్రాడ్యుయేషన్

జరిగెను. 15మందికి ఆరోజు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు వగయిరా ఇయ్యబడెను.

జనవరి 29వ తేదీ బుధవారం సాయంత్రం సోదరులు, సువార్తికులు తొమ్మండ్ర ప్రసాద రావ్ గారు ప్రభువునందు నిద్రించిరి. ఆయన కృష్ణా జిల్లా మైలవరంలోను పరిసరగ్రామములలోను క్రీస్తు సంఘము కొరకు గొప్ప సేవచేసిరి. తుది ఘడియ వరకు నమ్మకమైన పనిచేసిరి. ఆయనకు 71 సంవత్సరాలు. ఆయన విడిచి వెళ్లిన సతీమణికి, బిడ్డలకు, మనుమలకు, సంఘస్థులకు ఆదరణ కల్గునట్లు ప్రార్థించ మనవి. ఆయన భూస్థాపన కార్యక్రమానికి అనేక మంది సువార్తికులు, సంఘస్థులు, బంధువులు, మిత్రులు హాజరైరి.

జనవరి 30వ తేదీ నాడు జాషువా గూటంగారు కృష్ణాజిల్లా నందిగామ వెళ్లి అక్కడ నూతనముగా నిర్మించబడుతున్న క్రీస్తుసంఘ ఆలయమును పర్యవేక్షించిరి. నందిగామలో సోదరులు జి.మార్కుగారి కృషి వలన మంచి ఆలయము అక్కడ నిర్మించబడుచున్నది. ఆ పని విజయ వంతముగా సంపూర్తియగునట్లు ప్రార్థించమనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.